ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆల పురుషోత్తంరావు, రామచంద్రరాజు

అబిడ్స్, డిసెంబర్ 9 : ప్రజా సమస్యల కోసం ప్రతిపక్ష హోదాలో పోరాటం చేస్తామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన తలసానిని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆల పురుషోత్తంరావు, రామచంద్రరాజు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తలిపారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని గ్రామ గ్రామాన అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. అదే విధంగా పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సంక్షేమ పథకాలను చేపట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.

ప్రజల కోసమే బీఆర్ఎస్ పనిచేస్తుంది

ముత్యాల భాస్కర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు

కార్వాన్, డిసెంబర్ 9 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్వర్యంలో తాము అధికారంలో ఉన్నా లేకున్నా అనునిత్యం ప్రజల వెంటే ఉంటామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని కార్వాన్ డివిజన్ సీనియర్ బీఆర్ఎస్ నాయకుడు ముత్యాల భాస్కర్ అన్నారు. ఎన్నికలలో తమ ప్రభుత్వం స్వల్ప తేడాతో ప్రభుత్వం కోల్పోయినప్పటికీ తమకు ప్రజల మద్దతు ఉందన్నారు. రాబోయే లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతుందని అన్నారు.

వార్షికోత్సవ క్రీడా దినోత్సవాలు..

లాల్‌దర్వాజమోడ్ గోమతి హైస్కూల్ ఆధ్వర్యంలో వార్షికోత్సవ క్రీడా దినోత్సవాలను నిర్వహించారు. కరాటే విద్యార్థులు అద్భుతంగా రాణించి మోడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సంధ్య బన్సలీ, ప్రిన్సిపాల్ రవి బన్సలీ, కరాటే మాస్టర్ గణేశ్‌నాయక్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు.

– చంద్రాయణగుట్ట, డిసెంబర్ 9

సన్మానం..

రామగుండం కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను శనివారం మణికొండలో ఆయన కార్యాలయంలో మణికొండ ఐదవ వార్డు కౌన్సిలర్ ముత్యాలుతో పాటు సంఘ సేవకులు ఎ.శివకుమార్, జగదీశ్, మోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాకప్పి సన్మానించారు.

– చాంద్రాయణగుట్ట, డిసెంబర్ 9

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 9 : గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. విక్టోరియా ప్లే గ్రౌండ్ వద్ద ఉండే గుర్తు తెలియని 50 ఏళ్ల వ్యక్తి మృతదేహం రంగమహల్ రోడ్‌లోని ఫుట్‌పాత్‌పై పడి ఉందని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. కాగా మృతుడు చెక్స్ షర్టు, గ్రే కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. తీవ్ర అనారోగ్యం వల్లే మృతలి చెంది ఉండవ చ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ లకు ఆర్టీసీ.. ఉచిత ప్రయాణం

- శనివారం మధ్యాహ్నం నుంచే రాష్ట్ర వ్యాప్తంగా అమలు
  నగరంలో సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్,
  గ్రామాలలో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్‌లలో అనుమతి
- హర్షం వ్యక్తం చేసిన మహిళాలోకం

మహిళలకు ఉచిత ప్రయాణ బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న హైదరాబాద్ డిపో-1 డీఎం క్రిష్ణారెడ్డి

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 9: తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా టీఎస్ఆర్టీసీలోని పలు బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణానికి శ్రీకారం చుట్టింది.ఈ మేరకు టీఎస్ఆర్టీసీ సంస్థలోని నగరంలో సిటీ ఆర్డినరీ, సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్‌లలో, గ్రామాలలో పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్‌లలో శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి లాంఛనంగా ప్రారంభించారు. దీంతో తెలంగాణ వ్యాప్తంగా అన్ని వయస్సుల మహిళలు, విద్యార్థులు, యువతులకు ఈ ఉచిత సౌకర్యం వర్తించనుంది. ఈ సౌకర్యాన్ని రాష్ట్రంలో మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ అధికారులు కోరుతు న్నారు. హైదరాబాద్ డిపో-1 డీఎం క్రిష్ణారెడ్డి జెండా ఊపీ ప్రారంభించారు. అనంతరం మహిళలు ఉచిత ప్రయాణ వివరాలను తెలియజేశారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మహిళలు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.

ప్రయాణికులతో మాట్లాడుతున్న డిపో-1 డీఎం క్రిష్ణారెడ్డి

ఈ బస్సులలో మాత్రమే ..

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణంలో సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సులలో మాత్రమే మహిళలు ప్రయాణించాల్సి ఉంటుంది.ఆర్టీసీలోని సూపర్ లగ్జరీ, సూపర్ డీలక్స్, ఏసీ బస్సులలో ఉచితంగా ప్రయాణించడానికి అనుమతి లేదన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఆర్టీసీ అధికారులు కోరుతున్నారు. మహిళా ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఎంజీబీఎస్‌లో ..

మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో శనివారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని అఫ్జల్‌గంజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రతిభ, టీఎస్ఆర్టీసీ సీఆర్ఎం శ్రీనివాస్‌తో కలిసి ప్రారం భించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీఎస్ఆర్‌టీసీ పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచితంగా ప్రయాణించే అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం అందించిన గుర్తింపు కార్డులను చూపించి ఉచిత ప్రయాణం చేయవచ్చని ఆమె అన్నారు.

ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం తీసుకువచ్చిన మహాలక్ష్మి పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం అన్ని వయస్సుల మహిళలు సద్వినియోగం చేసుకోవాలి. బస్సులలో ప్రయాణించే మహిళలకు జీరో టిక్కెట్ అందించడం జరుగుతుంది.

–ఏ శ్రీధర్, ఆర్ఎం, టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి

మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

శివలింగానికి అభిషేకం చేస్తున్న శ్రీ సత్యసాయి సేవా సంస్థల, కోటి సమితి ప్రతినిధులు

అబిడ్స్, డిసెంబర్ 9 : శ్రీసత్యసాయి సేవా సంస్థలు, కోటి సమితి ఆధ్వర్యంలో కార్తిక మాస మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గౌలిగూడ చమాన్‌లో గల కోటి సమితి భజన హాల్‌లో శ్రీమసునూరి సంజీవ కుమార శర్మ పర్యవేక్షణలో జరిగింది. ముందుగా పూర్వ విద్యార్థులు డాక్టర్ కృత్తివెంతి అనిల్‌కుమార్, సాయి ప్రభాకర్, కన్వీనర్ పి. విశ్వేశ్వర శాస్త్రి, గుబ్బ జ్యోతి, శివమ్ భజన గాయని సరస్వతి ప్రసాద్, జ్యోతి ప్రజ్వలన చేసి సమస్తలోకా సుఖినోభవంతు అనే ప్రార్థనలో పాల్గొన్న ప్రతిఒక్కరి గోత్ర నామాలతో, కోటి సమితిలో ఉన్న అందిరి సేవా, గోత్రనామాలు చదవి గణపతిపూజ, మహన్యాసం, గూర్చి, విశదీకరంచి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తీర్థ ప్రసాదములతో అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బాల వికాస్ గ్రూప్ 1, గ్రూప్ 2లో ఉత్తీర్ణులైన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. గ్రూప్-1 విద్యార్థులు గొడిశాల ఆద్వితి గుప్తా, గోడిశాల వర్షిత గుప్తా, నాగ సత్యశ్రీ కృష్ణ, జెఆర్ సాయి మనస్వి, జేఆర్ సాయి రష్మిత, బి దేవస్య ధీమహి, బి దేవస్య విద్మహి, బి అనన్య, కె ధర్మతేజ్, ధనుంజయ్, గ్రూప్-2 విద్యార్థులు బి అనన్య, బి జయచంద్ర, బొల్లు ఉదయ్‌సాయి, బొల్లు భావనలకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టదలతో కృషి చేయాలి

కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రీరాములు తదితరులు

చిక్కడపల్లి, డిసెంబర్ 9 : విద్యార్థులు లక్ష్య సాధనకు క్రమశిక్షణ, పట్టదలతో కృషి చేస్తే విజయం సాధించడం సులభ తరం అవుతుంద ని పలువురు వక్తలు అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో కొత్త గా ప్రవేశం పొందిన ఎంబీఏ విద్యార్థులకు శనివారం ఓరియంటేసన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఓయూ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరాములు, డీబీఆర్ఏఈఐ జాయింట్ సెక్రటరీ పీవీ రమణకుమార్, అంబేద్కర్ విద్యాసంస్థల చైర్మన్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, కార్యదర్శి ఎమ్మెల్యే డాక్టర్ జి.వినోద్, కరస్పాండెంట్ సరోజా వివేక్, అడ్మినిస్ట్రేషన్ పి.నాగరాజు తదితరులు హాజరై విద్యార్థులకు సూచనలు చేశారు. డైరెక్టర్ కె.రత్న, డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ ఎన్.రిషికాంత్‌లు మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులకు కష్టపడి చదివి రాణించాలని సూచించారు.

మల్లేపల్లి ఐటీఐలో గ్రీన్ స్కిల్ ల్యాబ్ ప్రారంభం

మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రారంభించిన గ్రీన్ స్కిల్ ల్యాబ్ విద్యార్థులకు ఉపయోగపడుతుందని తెలంగాణ ఉపాధి శిక్షణ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకుడు ప్యారం నర్సయ్య తెలిపారు. శనివారం ఆయన కళశాలలో గ్రీన్ స్కిల్ ల్యాబ్‌ను ప్రిన్సిపాల్ పుప్పాల జ్యోతిరాణి, ఇండియా ఫౌండేషన్ డైరెక్టర్ రుపే బొహ్రా, మైక్రోసాఫ్ట్ నీతు, ఐడీసీ సీఎస్ఆర్ ల్యాండ్ మైక్రోసాఫ్ట్ రాజ్యలక్ష్మి, రాజ గోపాల్ లతో కలిసి ప్రారంభించి పరిశీలించారు. –సుల్తాన్‌బజార్,డిసెంబర్ 9

కనక విజయలక్ష్మికి గౌరవ డాక్టరేట్

కివీస్ కిడ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకురాలు కనక విజయలక్ష్మి సేవలు అభినందనీయమని ది అమెరికన్ యూనివర్సిటీ ఛాన్సలర్, అంతర్జాతీయ శాంతి దూత డాక్టర్ మధు కిషన్ అన్నారు. చెన్నయ్ టీ నగర్‌లోని సోషల్ క్లబ్‌లో జరిగిన గ్లోబల్ పీస్ సమ్మిట్ 2023 కార్యక్రమంలో భాగంగా ఆయన కనక విజయలక్ష్మికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసి సత్కరించారు. విభిన్న రంగాలలోని ప్రతి భావంతులైన వారికి అందించిన అంతర్జాతీయ పురస్కారాలలో భాగంగా ఎడ్యుకేషన్ కేటగిరిలో హైదరాబాద్‌కు చెందిన తనకు గౌరవ డాక్టర్ రావడం ఆనందంగా ఉందని కనక విజయలక్ష్మి తెలిపారు.

– తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 9